ప్రజాశక్తి
మంగళవారం 12 ఆగస్టు 2025 5 అనంతపురం

## రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో సత్తా

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు

అనంతపురం

**కలెక్టరేట్ :** విశాఖపట్నం వేదికగా పోలీస్ బారక్ మైదానంలో జరిగిన 6వ రాష్ట్రస్థాయి జూనియర్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులకు మొదటి స్థానం సాధించారు. రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో 40 మంది క్రీడాకారులు పాల్గొనగా మొదటి స్థానం ట్రోఫీని అందుకోవడం జిల్లాకు గర్వకారమని పారా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా మహాసభలు జరిగే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

## నేడు కదిరిలో సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా మహాసభలు

**హాజరుకానున్న రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు,**
**రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్**
**మహాసభకు ఏర్పాట్లు పూర్తి**
**ఎర్రజెండాలతో కదిరి ముస్తాబు**
**కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి, పోలా రామాంజనేయులు ప్రాంగణంలో ప్రతినిధుల సభ**

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

శ్రీసత్యసాయి జిల్లా సిపిఎం 14వ జిల్లా మహాసభలు మంగళవారం జరగనున్నాయి. కదిరి పట్టణ కేంద్రంగా మహాసభలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరుకానున్నారు. ఈయనతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్‌తో పాటు జిల్లా నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు కదిరి పట్టణంలోని ఎన్జీవో హోంలో మహాసభలు నిర్వహించేందుకు ఇప్పటికే ఆ పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మహాసభల ప్రాంగణానికి కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి, పోలా రామాంజనేయులు ప్రాంగణంగా నామకరణం చేశారు. గత మహాసభ నుంచి ఇప్పటి వరకు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాలు, పోరాటాలు సమీక్షించుకుని భవిష్యత్ కార్యచరణను రూపొందించనున్నారు. గత పోరాటాలను సమీక్షించుకుంటూనే రాబోయే రోజుల్లో ప్రజా పునాదిని పెంపొందించుకోవడంపై మహాసభ ద్వారా దృష్టి సారించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జివిఎల్.నరసింహులు తెలియజేశారు. మహాసభల నేపథ్యంలో కదిరి పట్టణం అంతా సిపిఎం జెండాలు, తోరణాలతో అలంకరించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి మహాసభకు హాజరయ్యే ప్రతినిధులకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. మహాసభల్లో జిల్లా అభివృద్ధి, వ్యవసాయం, కార్మిక రంగం, హంద్రీనీవా, నీటి జలాలు, స్థానిక యువతకు ఉపాధి, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తదితర వాటిపై తీర్మానాలు ప్రవేశపెట్టనున్నారు.

# ఉమ్మడి జిల్లాలో తగ్గని వానలు

### మద్దిలేరు వాగుపై కొట్టుకుపోయిన వంతెన
### ధర్మవరంలో నీటిలో పడి వ్యక్తి మృతి
### నిండిన చెరువులు, మునిగిన పంటపొలాలు

ధర్మవరంలో కూలిన ఇంటిగోడ

**ప్రజాశక్తి- యంత్రాంగం**

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం వర్షం కొనసాగింది. వర్షాలు కొనసాగాయి. పలు మండలాల్లో ఆదివారం రాత్రి సోమవారం మధ్యాహ్నం వరకు వర్షం పడింది. సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని శ్రీదేవి టాకీస్ వద్ద అధిక వర్షంతో మురుగుకాలువలు వర్షం నీటితో పొంగిపొర్లాయి. ఈ సమయంలో ఆదివారం రాత్రి అటుగా వెళ్లిన చేనేత కార్మికుడు నాగరాజు(60) అందులో ప్రమాదవశాత్తు పడి మరణించాడు. సత్యసాయి జిల్లా రొద్దం మండల పరిధిలోని రొద్దకంపల్లిలో రైతు రామాంజికి చెందిన మొక్కజొన్న పంటలోకి నీరు చేరింది. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం గాండ్లపాడు గ్రామంలో పుల్లారెడ్డికి చెందిన ఇంటి వర్షం ధాటికి నేలకూలింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి పుట్టపర్తి మండలం గాజులకుంట గ్రామ చెరువు నీటితో పూర్తిగా నిండింది. నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా అధికారులు తెలియజేశారు.

**కొట్టుకుపోయిన మద్దిలేరు వాగు వంక**

నాలుగు రోజలుగా కురుస్తున్న వర్షానికి జిల్లాలోని పలు కాలువలు నీటితో ప్రవహిస్తున్నాయి. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలోని మద్దిలేరు వాగుకు వరద ఉధృతి అధికం అయ్యింది. గత నాలుగు రోజలుగా వాగు నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం రాత్రి ప్రవాహం అధికం కావడంతో మద్దిలేరు వాగుపై గంగిరెడ్డిపల్లి-కొడవండ్లపల్లి గ్రామాల మధ్యలో నిర్మించిన వంతెన కొట్టుకుపోయింది. ఈ వంతెన కొట్టుకుపోవడంతో అటు వైపు, ఇటువైపు దాదాపు 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి. కొట్టుకుపోయిన వంతెనను రెవెన్యూ, పోలీసు అధికారులు పరిశీలించారు. నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలియజేశారు.

**కాలువలో పడి వ్యక్తి మృతి**

**ధర్మవరం రూరల్:** ధర్మవరం పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్థానిక శ్రీదేవి థియేటర్ వద్ద కాలువలో పడి బసవన్న కట్ట వీధికి చెందిన సుపారి నాగరాజు (60) అనే చేనేత కార్మికుడు మృతి చెందాడు. సోమవారం ఒకటో పట్టణ సిఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలకు వెళితే సుఫారి నాగరాజు పట్టుచీరలు మగ్గం వేస్తూ జీవనాన్ని కొనసాగించేవాడు. తరచూ మద్యాన్ని సేవిస్తూ ఉన్న క్రమంలో ఆదివారం రాత్రి కూడా మద్యం సేవించి డ్రైనేజీ పక్కన పడిపోయాడు. గత రాత్రి భారీ వర్షం రావడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీరు అధికం కావడంతో డ్రైనేజీలో పడి మృతిచెందాడు. సోమవారం ఉదయం పారిశుధ్య కార్మికులు డ్రైనేజీలను శుభ్రం చేస్తుండగా నాగరాజు మృతదేహం బయటపడింది. భారీ వర్షాలకు కూలిన ఇళ్లను రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు.

**నిండిన గాజులపల్లి చెరువు**

**పుట్టపర్తి రూరల్ :** నాలుగు రోజులనుండి సత్యసాయి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పుట్టపర్తి మండల పరిధిలోని గాజులపల్లి చెరువు నిండిమరువ పారుతుంది. ఈ చెరువు నుండి మరువ నీరు వంగ పేరు నది ద్వారా క్రింది ప్రాంతమైన నిడిమామిడి, కొట్లపల్లి, ఇరగరాజు పల్లి మీదుగా చిత్రావతి నదిలోకి కలుస్తుంది. ఆదివారం రాత్రి ఎగువ ప్రాంతాలైన పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు లోకి నీళు చేరి మరువు పారుతున్నట్టు రైతులు తెలిపారు.మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుండి సోమవారం ఉదయం వరకు వర్షాలు కురిసాయి. దాంతో మండలంలోని బత్తలపల్లి ,గువ్వలగుట్టపల్లి, వెంగళమ్మ చెరువు, యనమలపల్లి, బుక్కపట్నం చెరువులకు వంకల ద్వారా చెరువుల్లోకి నీరు చేరుతోంది.

మరువ పారుతున్న పుట్టపర్తిలోని గాజులపల్లి చెరువు

రొద్దం మండలంలో మొక్కజొన్న పంటలోకి చేరిన వర్షపునీరు

**నీటి మునిగిన మొక్కజొన్న పంట**

**రొద్దం :** మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, పంటలు నీట మునిగాయి. ఇందులో భాగంగా రొద్దకంపల్లి పొలంలో రైతు రామాంజికి చెందిన మొక్కజొన్న పంటలో నీరు చేరింది. దీంతో చేతికి వచ్చిన పంట నోటికి అందకుండా పోయిందని రైతు వాపోయాడు. గతంలో వర్షపు నీరు ముందుకు వెళ్లడానికి కాలువలు ఉండేవని ఇప్పుడు ఆ కాలువలు కొంతమంది పూడ్చి వేసి పంట పొలాలుగా చేసుకొన్నారనిదీంతో పైనుంచి వచ్చిన నీరు ముందుకు వెళ్లలేక తగ్గుగా ఉన్న పొలాల్లోకి వెళుతున్నాయని అన్నారు.

**అప్రమత్తంగా ఉండండి : ఆర్డీవో**

**ధర్మవరం రూరల్ :** ధర్మవరం డివిజన్ లో గత నాలుగు రోజులు నుండి కురుస్తున్న భారీవర్షాలకు తోడు ఇంకా నాలుగు రోజులు వర్షాలుకురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు జిల్లాలోఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

**బి టి ప్రాజెక్ట్ నీటిమట్టం1649.6 అడుగులు**

**రాయదుర్గం:** అనంతపురం జిల్లాలోని భైరవాని తిప్ప ప్రాజెక్టు రిజర్వాయర్ నీటిమట్టం సోమవారం నాటికి 1649.6 అడుగులు ఉన్నట్లు నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరీష్ తెలిపారు. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 1655 అడుగులు కాగా ప్రస్తుతం రిజర్వాయర్ లోకి 3125 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు తెలిపారు. రిజర్వాయర్లో1251 ఎంసిఎఫ్‌టి నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

**వర్షానికి కూలిన ఇంటి గోడ**

**పుట్లూరు :** వర్షానికి మండల పరిధిలోని గాండ్లపాడు గ్రామానికి చెందిన పుల్లారెడ్డి ఇంటి గోడ ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. దీంతో బాధితుడు పుల్లారెడ్డి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేసి ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

# అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలివ్వాలి : సిపిఎం

ధర్నాలో పాల్గొన్న నాయకులు, పేద మహిళలు

**ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్**

అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలివ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్లస్థలాలివ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్ఫాన్ అధ్యక్షతన జరిగిన ధర్నా లో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ ఉప్పర పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 194/ 8 సర్వే నంబర్ లో 350 మంది పేదలు గుడిసెలు వేసుకొని నాలుగు సంవత్సరాలుగా జీవిస్తున్నారని వారికి ఇళ్లపట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. సీతారాం ఏచూరి నగర్, దామోదర సంజీవయ్య నగర్ లో పేదరికంలో ఉన్న ప్రజలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని అధికారులు వారిని కనీసమైన మౌలిక సౌకర్యాలు కూడా కల్పించలేదని విమర్శించారు. భూ మాఫియా పెట్రేగిపోతోందన్నారు. ఆ కాలనీలో నివసిస్తున్న ప్రజల దగ్గరికి పోయి ఖాళీ చేసి వెళ్లిపోవాలని లేకపోతే బలవంతంగా గుడిసెలను తొలగిస్తామని భయ భ్రాంతుల గురి చేస్తున్నారని విమర్శించారు. రోజు కూలి పని చేసుకునే వీరు ఎప్పుడు ఏమి జరుగుతుందో అని భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. రెండు సంవత్సరాల క్రితం అప్పటి ఆర్డీవో, తహశీల్దార్ ఇక్కడ నివసిస్తున్న వారందరూ తమ ఆధార్ కార్డును, రేషన్ కార్డును ఇస్తే పరిశీలించి అర్హులు అయితే వారికి ఇక్కడే ఇళ్లస్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆసమయంలో 500 మందికి పైగా ఆర్డీవో కార్యాలయంలో ఇళ్లపట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్కడ నివసిస్తున్న పేదలందరికీ ఇళ్లపట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహశీల్దార్ మోహన్‌కుమార్ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్యను తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటనారాయణ ప్రకాష్, మసూద్, వలీ, రాజు, గపూర్, సీతారాం ఏచూరి కాలనీవాసులు నాయకులు శంకర్, మనీ, ఇస్రాయిల్, హాజీవలి, ప్రసాద్, సిద్దు, పెద్దన్న, పద్మావతి, విశ్వనాథ్, నాగేంద్రమ్మ దామోదర సంజీవయ్య కాలనీ నాయకులు వెంకటేష్ గౌడ్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## బిటిపి భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

### రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిహెచ్ రాయుడు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**

ఆర్‌డిఒ వసంతబాబుకు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

భైరవానితిప్ప, కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌కు భూములు కోల్పోయిన రైతులకు నష్టం కల్గించకుండా న్యాయం చేయాల రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిహెచ్ రాయుడు కోరారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్‌డిఒ వసంతబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిగల్లు రెవెన్యూ పరిధిలోని వందలాది మంది రైతులు బిటిపి కాలువకు భూములు కోల్పోతున్నారన్నారు. ఇందులో చాలామందికి పరిహారం అందిందన్నారు. అయితే కాలువ తవ్వడంలో ఆలస్యం కావడంతో ప్రతిఏటా మాదిరి ఈసారి కూడా పంటలు సాగు చేసుకున్నారన్నారు. ముందస్తు సమాచారం లేకుండా కాలువలు తవ్వడానికి హడావుడి చేస్తుండటంతో రైతులు పంటలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మూడు నెలలు ఆగి కాలువలు తవ్వితే సాగు చేసిన పంటలను తొలగించుకుంటారన్నారు. కావున రైతులకు సహకరించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్‌ప్రసాద్, బోరంపల్లి గ్రామానికి చెందిన రైతులు ఫకృద్దీన్, గోపాల్‌రెడ్డి, కలుగురి రామాంజినేయులు, లోకేష్, రాము, నాయకులు మంజునాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బలరామ్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై చర్యలు తీసుకోవాలి

### సిపిఎం, కౌలురైతు సంఘం నాయకులు

**ప్రజాశక్తి-ఉరవకొండ**

ఉరవకొండలో యూరియా కొరత సృష్టిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఫర్టిలైజర్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేశులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫర్టిలైజర్స్ నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడి ఇతర ఎరువులను తీసుకున్నవారికి మాత్రమే యూరియా ఇస్తామని రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా రైతులను ఇబ్బందులకు గురి చేసేలా ఫర్టిలైజర్స్ నిర్వాహకులు వ్యవహరిస్తున్నారన్నారు. వారి వద్ద యూరియా ఉన్నప్పటికీ రైతులకు ఇవ్వకుండా తమ దగ్గర స్టాక్ లేదంటూ వెనక్కి పంపుతున్నారని ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన వ్యవసాయ అధికారి రామకృష్ణ వెంటనే ఫర్టిలైజర్స్ నిర్వాహకులకు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రతి రైతుకూ కచ్చితంగా యూరియా ఇవ్వాలని, మరోసారి రైతులతో ఇలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జ్ఞానమూర్తి, సీనప్ప, కౌలు రైతుసంఘం నాయకులు సుంకన్న, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



ఫర్టిలైజర్స్ నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎఒ రామకృష్ణ

## దేశభక్తిని చాటి చెప్పేందుకే 'హర్ ఘర్ తిరంగా'

### ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

దేశభక్తిని చాటి చెప్పేందుకే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయన్‌శర్మ తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోటార్ బైక్ ర్యాలీని ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రారంభించారు. స్థానిక రోడ్లు, భవనాల శాఖ విశ్రాంతి అతిథి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ సప్తగిరి సర్కిల్ మీదుగా టవర్ క్లాక్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆగస్టు 2 నుంచి 15వతేదీ వరకూ దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశన్నారు. అనంతరం టవర్‌క్లాక్ వద్ద హర్ ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్ లో ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి జయకుమార్, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఇఇలు షాకీర్, చంద్రశేఖర్, బిఎల్ నరసింహ, కార్పొరేషన్ సిబ్బంది, అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

కెఎస్‌ఆర్ బాలికల కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు అధ్యాపకులు

## భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

### డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'పీఠిక' ప్రతిజ్ఞ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, కసాపురం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం ఇన్ని సంవత్సరాలుగా మనుగడ సాగించడానికి కారణం నాయకులు ఎంతో దూరదృష్టితో రచించిన భారత రాజ్యాంగమే కారణమన్నారు. ఈ విషయాన్ని రాజ్యాంగానికి మృదయమైన పీఠిక వివరిస్తుందన్నారు. అలాగే పీఠికలో దేశాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలనే విషయాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర అనే భావనలతో వివరించారన్నారు. బడుగు, బలహీనులకు రాజ్యాంగమే అండ అన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ చదివి తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలలన్నారు. బాధ్యత ఉన్న పౌరులుగా తమ ఓటు హక్కు ద్వారా మెరుగైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నూరుల్లా, సురేంద్రబాబు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' విధానాన్ని రద్దు చేయాలి

### సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

**ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్**

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఓటుహక్కును హరించేందుకే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తన నియంతృత్వ అధికారాన్ని చేతికించుకునేందుకు కుట్టిలయత్నం చేస్తోందన్నారు. ఓటరు సవరణలో భాగంగా బీహార్ రాష్ట్రంలో ఇప్పటికే 15 లక్షల మంది ఓటర్లను రద్దు చేశారన్నారు. మరో 40 లక్షలు తొలగించేందుకు అదును కోసం వేచి చూస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం ఓటర్లకు ప్రసాదించిన ఓటుహక్కును కాలరాస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందన్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లిములు, దళితులపై దాడులు చేయడం పరిపాటిగా మారాయన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ నారాయణస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో నాయకులు మారుతీప్రసాద్, సాకే నాగరాజు, అబ్దుల్లా, షాషావలి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎర్రకోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని

విద్యార్థిని సుమియాను అభినందిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

**అనంతపురం :** ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నగరంలోని ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ఎంపికైంది. ఆర్ట్స్ కళాశాలలో అర్థశాస్త్రంలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఎస్.సుమియా (ఎన్ఎస్ఎస్) ఢిల్లీలో జరగబోయే స్వాతంత్ర్య దినోత్సవంలో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించనునాన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఎన్ఎస్ఎస్ పిఒ బాలాజీనాయక్, జయలక్ష్మి, సోమశేఖర్, సుధాకర్, తదితరులు అభినందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



# 'కూటమి' మోసాలను ప్రజలకు వివరిద్దాం

## మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

అనేక మోసపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ మోసాలు, దారుణాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని కనకదాసు కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇవిఎంలతో గెలిచి అధికారంలోకి వచ్చిందని దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, మానభంగాలతో పాలన సాగిస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అనంతపురం మండలానికి రూ.90కోట్లతో పిఎబిఆర్ ద్వారా పైప్‌లైన్ల పనులను 80 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన 20 శాతం ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలు, దాడులు, హత్యలు, మానభంగాలు, దొంగతనాలకు తట్టుకుని ఎదురు నిలిచి పోరాడిన రాప్తాడు నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కమిషన్ల కోసం కక్కుర్తి పడే ఎమ్మెల్యే సునీత కనీసం ప్రజల సమస్యలపై నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. ప్రతి గ్రామంలో 23 కమిటీలు వేసి వారానికి మూడు రోజులు గ్రామాల్లో పర్యటిస్తానన్నారు. అలాగే త్వరలోనే కార్యకర్తలతో 'కాఫీ' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. స్థానిక ఎన్నికలకు సిద్ధమై బలమైన పోరాటం చేసి విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**బాధిత కుటుంబానికి పరామర్శ**

ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన 5వ వార్డు సభ్యులు పెద్దన్న కుటుంబాన్ని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అధైర్య పడకుండా ఉండాలని, ధైర్యంగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# మోసం చేస్తేనే 11సీట్లు ఇచ్చారు...

## టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

రాష్ట్రాన్ని ఎవరు మోసం చేశారో ప్రజలందరికీ తెలుసు అని.. అందుకే వైసిపిని 11 సీట్లకు పరిమితం చేశారని టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికల ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఇప్పటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్, మెగా డీఎస్సీ లాంటి పథకాలను అమలు చేశామన్నారు. ఈనెలలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఇవి ఓర్చుకోలేని వైసిపి నాయకులు రాజకీయ ఉనికి కోసం విమర్శలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గంలో ఏడాదిలో రూ.20కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకూ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ కందల, బీసీ సెల్ వెంకట్ నారాయణ, ఓబుళపతి చౌదరి, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు

# 'ఉపాధి' బిల్లులు చెల్లించాలని వినతి

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఎపిఒ సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని, అడిగిన వారందరికీ పనులు కల్పించాలని, 200 రోజులు పని దినాలు, రూ.600 ఇవ్వాలని, రెండు పూటలా మస్టరు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు ఎపిఒ స్పందిస్తూ ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నాగలింగమయ్య, వెంకటేష్, వెంకట్‌రాముడు, అంజలి, లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, చెన్నప్ప, వెంకటేష్, రాముడు, కప్పలకొండ నారాయణస్వామి, మునిరాజ్, తదితరులు పాల్గొన్నారు.


ఎపిఒతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

# కక్షసాధింపు తప్ప.. సంక్షేమం, అభివృద్ధి ఏదీ..?

## వైసిపి సమన్వయకర్త శైలజనాథ్, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

**ప్రజాశక్తి-శింగనమల**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షసాధింపు తప్ప.. సంక్షేమం, అభివృద్ధి ఏదీ.. అని వైసిపి సమన్వయకర్త శైలజనాథ్, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. వైసిపి మండల కన్వీనర్ పూల ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందన్నారు. ముఖ్యంగా ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేక కుట్రలు, కుతంత్రాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, తరిమెల గోకుల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎం.వీరాంజనేయులు, భాస్కర్‌రెడ్డి, మురార్జి, సోదనపల్లి చాగంటి గురుమూర్తిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, కొప్పర్ల నాగవర్ధన్‌రెడ్డి, నూరు మహమ్మద్, దాసరి వెంకట్రాముడు, బంగారు అలీబాషా, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులునాయక్, జగన్మోహన్‌రెడ్డి, చాగంటి హేమచంద్రారెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

**యల్లనూరు** : మండలంలోని కోడుమూర్తి, చిలమకూరు, అచ్యుతాపురం, తిరుమలాపురం, వాసపురం గ్రామాల్లో వైసిపి నాయకులు సోమవారం 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శివశంకర్, విష్ణునారాయణ, నాగరాజు, రమణ, ఎర్రి నాగయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పుట్లూరు** : వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తిమ్మాపురం, గాండ్లపాడు, తక్కలపల్లి గ్రామాల్లో బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు నరసింహారెడ్డి, సర్పంచులు సూర్యనారాయణరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచు సుబ్బారెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, రామిరెడ్డి, పెద్దిరాజు, అమర్నాథ్‌రెడ్డి, రాఘవరెడ్డి, హనుమంతురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమలలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న వైసిపి నాయకులు

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**బుక్కరాయసముద్రం** : అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పేదలకు మంజూరైన రూ.23,98,490 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేదలకు సిఎం సహాయ నిధి ఎంతో ఆర్థిక చేయూతనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, పొడరాళ్ల రవీంద్ర, చిన్నంపల్లి మాజీ సర్పంచు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

# పండ్లతోటల రైతులను ఆదుకోవాలి

**బుక్కరాయసముద్రం** : జిల్లాలోని పండ్ల తోటల రైతులను ఆదుకోవాలని పండ్ల తోటల జిల్లా రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 19 నెలల్లో 95 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. దీనిబట్టి చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఏ పంటకూ గిట్టుబాటు ధర రాని పరిస్థితి నెలకొందన్నారు. మరోవైపు పెట్టుబడులు పెరిగిపోయాయన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చే రాయితీలను ఉద్యానవన రైతులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పండ్ల తోటల రైతు సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

# దరఖాస్తులు ఆహ్వానం

**ఉరవకొండ** : పాలకమండలి సభ్యుల నియామకం కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్‌బాబు సోమవార ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి పాలకమండలి నియామకానికి అర్హులైన అభ్యర్థులు 20 రోజుల్లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

# వైభవంగా గద్దెరాళ్ల తిమ్మప్ప స్వామి కళ్యాణం

**గుత్తి** : మండలం బసినేపల్లి గ్రామంలోని గుట్టపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత గద్దెరాళ్ల తిమ్మప్ప స్వామి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున స్వామి, అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్ల విగ్రహాలకు కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

# గుంతకల్లు కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

**గుత్తి** : గుంతకల్లు కేంద్రంగా నూతన జిల్లా జిల్లాను ఏర్పాటు చేయాలని వైసిపి ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కొత్తపేట వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని భావిస్తోందన్నారు. గుంతకల్లులో రెవెన్యూ డివిజన్ కూడా ఏర్పాటు చేశారన్నారు. దేశంలోని జిల్లాల్లో పెద్ద జిల్లాగా ఉన్న అనంతరం మూడు జిల్లాలుగా విభజించవచ్చన్నారు. ఇప్పటికే గుంతకల్లు కేంద్రంగా రైల్వే డివిజన్ ఉందని జిల్లా చేయటానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు.

# గుత్తి ఎస్ఐగా ఎ.నాగప్ప

**గుత్తి** : గుత్తి సబ్ ఇన్స్‌పెక్టర్-2గా ఎ.నాగప్ప బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుత్తి రైల్వే ప్రభుత్వ ఎస్ఐగా పని చేస్తున్న ఆయన బదిలీపై సివిల్ ఎస్ఐగా వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.సురేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అరికడతామన్నారు.

# శ్రీరాములు సేవలు ప్రశంసనీయం

**ఉరవకొండ** : వైద్య, ఆరోగ్య శాఖలో చిన్నోళ్ల శ్రీరాములు సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. వజ్రకరూరు పిహెచ్‌సిలో ఎంపిహెచ్ఇఒగా పని చేస్తూ గతనెల 31న ఉద్యోగ విరమణ పొందిన శ్రీరాములు ఆత్మీయ అభినందన సభను ఆదివారం రాత్రి పట్టణంలోని జేఎస్ పి ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్, ఎంఇఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాధర్, విడపనకల్లు మాజీ జడ్పిటిసి తిప్పయ్య, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ భాస్కర్‌బాబు, డిఐఒ డాక్టర్ యుగంధర్, డాక్టర్లు గంగాధర్‌రెడ్డి, నారాయణస్వామి, సంధ్య, మనోజ్, ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, ఎంఇఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, ఎన్‌జిఒ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, మనోహర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నేత శ్రీధర్, నేతలు అతావుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులకు వైద్యపరీక్షలు

**యాడికి** : ప్రధానమంత్రి సురక్షిత మాతృత అభియాన్ కార్యక్రమంలో సోమవారం మండల కేంద్రంతోపాటు రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయిసుమంత్‌రెడ్డి, డాక్టర్ దేవరాజ్, డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఇంజక్షన్లు, మందులు అందజేశారు. గర్భిణులు, సహాయకులకు ప్రముఖ పారిశ్రామికవేత్తలు సివి రమణారెడ్డి, రంజిత్ కుమార్ భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో యాడికి, రాయలచెరువు సూపర్‌వైజర్లు షబ్బీర్, రామ్‌ప్రసాద్‌గౌడ్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌సిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సొంత నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం

**డి.హీరేహాల్** : మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంతురెడ్డి తన సొంత నిధులతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన బోరు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగల్లి రాజు, మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, తదితరులు, నాయకులు పాల్గొన్నారు

బోరు వేసేందుకు పూజలు చేస్తున్న మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంతురెడ్డి

# విగ్రహ ప్రతిష్టాపన

**పెద్దపప్పూరు** : మండలం పరిధిలోని తురకపల్లి గ్రామంలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలతోపాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం గణపతి పూజ, హోమాలు, మంగళవారం పలు పూజలు, సాయంత్రం స్వామి విగ్రహాల గ్రామోత్సవం, బుధవారం విగ్రహాలను ప్రతిష్టించనున్నట్లు తెలిపారు. కావున విగ్రహాల ప్రతిష్టకు గ్రామంలోని బంధుమిత్రులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.


నూతనంగా నిర్మించిన ఆలయం

# రోడ్డు ప్రమాదంలో కర్నాటక వాసి మృతి

**చిలమత్తూరు** : మండలంలోని 44వ నెంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శేఖర్(26) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నాటకలోని నగరిగెరకు చెందిన శేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ చెక్‌పోస్టులో గంగోత్రి హోటల్ వైపు నుంచి రోడ్డు దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి వచ్చిన ఓ ప్రయివేటు ట్రావెల్స్ బస్సు వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా అతడితో పాటు ప్రయాణిస్తున్న మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**NAME CHANGE**

I, **Zainul Abidden B. K alias Zainul Abidden Bangaru Kadiyal S/O B K Masum Peer**, R/o 6-3-141/7 Fantacy Residency Flat No-203, Ram Nagar, Ananthapuram, Andhra Pradesh- 515001, have changed my name and shall hereafter be Known as **Bangaru K Zainul Abideen**.

**మహారాజశ్రీ గుత్తి ఆరవ అదనపు జిల్లా కోర్టు గుత్తి**

**I.A.519/2024 IN A.S.No.Nil/2024**

**Between:**

R.Rupla Naik S/o R.Hanka Naik R/o D.no-5-16, Venkatampallithanda, Venkatampalli (V), Vajrakaruru (M), Ananthapuramu Dist.

**...Petitioner/Appeallent**

**AND**

G.Ramesh S/o late G.Venkata swamy R/o D.No:11-21, RJ street, Guntakal (T&M), Ananthapuramu Dist. **...Respondent/Respondent**

**NOTICE TO RESPONDENT**

పై దావాలో మీ హాజరు నిమిత్తము పై కోర్టు వారు నోటీసు ద్వారా మీ హాజరు తేది 22.08.2025 ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు హాజరు కావలసిందిగా తెలియజేయడమైనది. ఆరోజు మీరు స్వతహగా గాని వకీలు ద్వారా గానీ పై కోర్టులో పై తేదిలో మీరు హాజరై ఏవైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేయవలెను. లేని యెడల పై దావాలో మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

**B.SUDHARSHANA RAO**
Advocate, Gooty
9959247281

# పెట్టుబడి లేని వ్యవసాయంతోనే రైతుల అభివృద్ధి

## ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్

**ప్రజాశక్తి-అనంతపురం**

పెట్టుబడి లేని వ్యవసాయంతోనే రైతుల అభివృద్ధి సాధ్యమని అనంతపురం ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్ సూచించారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి రైతు సేవా కేంద్రంలో జీరో బేస్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు వాడకుండా భూమిని సారవంతం చేయడానికి పిఎండిఎస్ మోడల్, ఎటిఎం మోడల్ రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అలాగే పిఎండిఎస్ మోడల్‌లో 365 రోజులు వ్యవసాయ పంటలు పెట్టడం వల్ల వాతావరణ వేడి తగ్గుతుందన్నారు. అంతేగాకుండా భూములు సారవంతం అవుతాయన్నారు. సంవత్సరం పొడవునా పంటలు ఉండడం వల్ల చల్లదనానికి వానపాములు కూడా భూమిలో ఉండి భూమిని గుల్లపరిచి సారవంతం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌బిఎన్ ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్, రవీందర్‌రెడ్డి, దేవి, డిపిఎం ఆఫీస్ స్టాఫ్ గణేష్, చైతన్య, నరేంద్ర, ఆరు మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్

# 'భూసేకరణ-నష్టపరిహారం చెల్లించడం' పుస్తకావిష్కరణ

**అనంతపురం** : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ న్యాయ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్, విభాగాధిపతి ఎం.శ్రీరాములు పర్యవేక్షణలో బి.వెంకటేశ్వర్లు రాసిన 'భారతదేశంలో భూసేకరణ-భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించడం' అనే పుస్తకాన్ని ఇన్‌ఛార్జి ఉపకులపతి బి.అనిత, రిజిస్ట్రార్ ఇ.రమేష్‌బాబు సోమవారం స్థానిక పరిపాలన భవనంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసన్, భాస్కర్‌రెడ్డి, తిమ్మయ్య, శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

# వంతెన నిర్మించాలని వినతి

**రాయదుర్గం** : పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఈద్గా, శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో వంతెన వేసి శాశ్వత పరిష్కారం చూపించాలని రాయదుర్గం ఖబరస్తాన్ కమిటీ, ఈద్గా కమిటీ, అహ్లె జమాత్ సభ్యులు కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైపుల్లా మాట్లాడుతూ మురికి కాలువపై ఉన్న బండలు విరిగిపోతుండటంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. దీనికితోడు శ్మశానవాటికకు మరణించిన వారిని తీసుకెళ్లేటప్పుడు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కావున వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మహమ్మద్ రఫీక్, మున్సిపల్ వార్డు సభ్యులు ఫక్రుద్దీన్, ఖలందర్, నిజాముద్దీన్, ఫైజుల్లా, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

**కళ్యాణదుర్గం రూరల్** : పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.హర్షలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన వారికి ఈనెల 19న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

# నేడు ఆసుపత్రి భవనం ప్రారంభం

## ప్రజాశక్తి కథనానికి స్పందన

**పెద్దవడుగూరు** : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవన నిర్మాణాన్ని ఈనెల 12వతేదీన ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో గత శనివారం 'పాత భవనంలోనే సేవలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన అధికారులు నూతన ఆసుపత్రి భవన ప్రారంభోత్సవానికి ముహూర్తం నిర్ణయించారు. ఈనెల 12న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డితో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# పంచాయతీ నిధులు జమ చేయాలని వినతి

**నార్పల** : గ్రామ పంచాయతీలకు నిధులు జమ చేయాలని కోరుతూ మండలంలోని సర్పంచులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థికసంఘం నిధులతో పాటు సాధారణ నిధులు జమకాలేదన్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. కావున వెంటనే నిధులు మంజూరు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సుప్రియ, రామాంజనేయులు, కుళ్లాయిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, నాగన్న, కుళ్లాయప్ప, రమణకుమారి, శివయ్య, రామాంజనమ్మ, రాము, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీ అరెస్టు పిరికిపంద చర్య

**రాయదుర్గం** : రాహుల్ గాంధీని అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ సిరికి చర్య అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఓట్లు చోరీ జరగడంతోనే కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడిందని తమ నాయకుడు రాహుల్‌గాంధీ సాక్ష్యాధారాలతో వివరించడానికి ఎలక్షన్ కమిషన్ ఆఫీసుకు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తుంటే అక్రమంగా అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమ అరెస్టుల ధోరణిని కేంద్ర ప్రభుత్వం విడనాడాలని కోరారు. సాక్ష్యాధారాలతో వస్తున్న రాహుల్ గాంధీని పోలీసులను అడ్డుపెట్టుకుని అరెస్టు చేయించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ కన్వీనర్ జయన్న, మైనార్టీ నాయకుడు బిలాల్, నాయకులు మహబూబ్‌బాషా, మంజు పాల్గొన్నారు.

# రజకుల సమస్యలు పరిష్కరించాలి

**పెద్దపప్పూరు** : రజకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రజక వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య, జిల్లా అధ్యక్షులు సి.నాగప్ప, తాడిపత్రి పట్టణ అధ్యక్షులు సూరి, మండల అధ్యక్షుడు సిగురప్ప పి.పుల్లన్న, సురేష్, మూర్తి, రంగనాథ, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**Maheswara Mutually Aided Cooperative Credit Society Ltd.**
Regd No: AMC/ATP/DCO/2021/5001
D.No.10/379, Old Super Bazar, Opp To South India Shopping Mall, Subash Road, Anantapuramu

**NOTICE**

Notice of 4th Annual General Body Meeting of Maheswara MACC Society Ltd will be held at Registered Office permises D.No.10/379, Old Super Bazar, Opp To South India Shopping Mall, Subash Road, Anantapuramu on 05-09-2025 at 11:00 AM

All members are requested to attend the meeting.

**AGENDA**

- To approve accounts for 2024-2025
- To appoint Auditor for year 2025-2026
- To declare dividend (if Required)
- To accept changes in Directors
- To consider amendment of By-laws if any
- Any other subject that may be placed before the General Body Meeting with the permission of Chairman.
- All members are requested to observe COV1D protocals.

M.B.SAI MANJUNATH
CHAIRMAN

# బ్రాండ్లకు కేరాఫ్ 'శోభ టెక్స్‌టైల్స్'

**ప్రజాశక్తి-అనంతపురం**

షూటింగ్, షర్టింగ్‌లకు బ్రాండింగ్ కేరాఫ్‌గా నగరంలోని రఘువీరా టవర్స్‌లో ఉన్న శోభ టెక్స్‌టైల్స్ నిలుస్తోందని మేనేజింగ్ డైరెక్టర్ సి.మంజునాథ్. బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ 'శోభ టెక్స్‌టైల్స్' 2004లో ప్రారంభించినప్పటి నుంచి రెండు దశాబ్దాలకుపైగా ప్రజాధరణతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. విశేషమైన ప్రజాదరణతో దాదాపుగా 15 బ్రాంచులను వివిధ రకాల పేర్లతో నడుస్తున్నట్లు చెప్పారు. దీనికితోడు సుమారుగా 100 మంది ఉద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, యూత్‌కు సంబంధించిన వివిధ రకాల మోడల్స్ అన్ని రకాల బ్రాండ్స్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఫంక్షన్‌లు ఏవైనా షూటింగ్ షర్టింగ్‌కు శోభ టెక్స్‌టైల్స్ కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. నమ్మకం, నాణ్యత, అందరికీ అందుబాటు ధరల్లో గుర్తింపు తగిన బ్రాండ్లు సైతం అందిస్తున్నట్లు వివరించారు. ఆదిత్య బిర్లా, రామ్ రాజ్ వంటి ప్రముఖ బ్రాండ్ తమ వద్ద లభిస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పలు రకాల బ్రాండ్ సంస్థలకు తాము డీలర్లుగా ఉన్నామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు షూటింగ్ షర్టింగ్‌కు తమను ఆదరించాలని కోరారు.

నగరంలోని శోభా టెక్స్‌టైల్ దుకాణం, (ఇన్‌సెట్‌లో) మేనేజింగ్ డైరెక్టర్ సి.మంజునాథ్

# నేరాలు ఘోరాలు

## బేకరీ దగ్ధం

**బుక్కరాయసముద్రం** : మండల కేంద్రంలోని నార్పల క్రాస్‌లో ఉన్న బీబీ అయ్యంగారి బేకరీ సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. అయితే వారు వచ్చేలోపు బేకరీ పూర్తిగా దగ్ధమైంది. దీంతో సుమారు రూ.25లక్షల వరకూ నష్టం సంభవించిందని దుకాణ నిర్వాహకుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న సిఐ పుల్లయ్య, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## ఆరుగురిపై పిచ్చికుక్క దాడి

**ఉరవకొండ** : ఉరవకొండలో పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక కవిత సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చిన్నముష్టూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఓబులేసు, నారాయణపై దాడి చేసి కరిచింది. అదేవిధంగా పాత స్టేట్ బ్యాంక్ సర్కిల్ వద్ద కూడా ఇద్దరిని గాయపరిచింది. టవర్‌క్లాక్ సమీపంలో చాబాల రోడ్డులో మరో ఇద్దరిపై దాడి చేసి గాయపరిచింది. ఆరుగురూ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.